క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ


తిమ్మరాజును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

కళ్యాణదుర్గం: అనంతపురంలోని ఎస్వీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్య కర్త తిమ్మరాజు ను మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. ఆదివారం ఆస్పత్రికి వెళ్లి తిమ్మరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మాజీ ఎంపీ వెంట పార్టీ నాయకుడు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం

కూడేరు: మండలంలోని మరుట్ల–2వ కాలనీలో కోనేపల్లి గోపాల్ రెడ్డి, నారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. అందులో విలువైన కాపర్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. ముగ్గురు రైతులు తమ పొలాల్లో చీనీ, వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశారు. ఒక ట్రాన్స్ ఫార్మర్ విలువ సుమారు రూ.70 వేలు వరకు అవుతుందని, విద్యుత్ సరఫరా లేకపోతే పంటలకు నీరందక ఎండి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిత్యాన్నదానం ప్రారంభం


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లు శివారులోని అయ్యప్పస్వామి ఆలయంలో భక్తుల సహకారంతో 41 రోజుల పాటు నిర్వహించే నిత్యాన్నదానం ఆదివారం ప్రారంభమైంది. డిసెంబర్ 1 నుంచి జనవరి 10 వరకు ఆలయంలో అయ్యప్పస్వామి మాలధారులకు నిత్యాన్నదానం కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. తొలి రోజున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తీవ్ర తాగునీటి ఎద్దడి


తాగునీటి కోసం అవస్థలు పడుతున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలో వారం రోజులుగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. సజ్జలకాలనీ, బోయవీధి, కనుసప్పగుట్టకాలనీ, పైగేరి ప్రాంతం తదితర కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుచోట్ల తాగునీటి పైపులు ధ్వంసం కావడం, రాజకీయ నాయకులు అక్రమ కనెక్షన్లు వేసుకోవడంతోపాటు బోరుబావుల్లో నీరు సమృద్ధిగా రాకపోవడంతో సమస్య నెలకొంది. తాగునీటి సమస్య విషయంపై సర్పంచు మారుతేశ్వరి మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


దొడగట్టలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసప్ప తల్లి సన్నక్క అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు ఆదివారం దొడగట్టలోని సన్నక్క మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దొడగట్ట నారాయణ, నాయకులు బసవరాజు, గోవిందప్ప, కులాయిస్వామి, చిత్తయ్య, బసిరెడ్డి, తలారి పాలన్న, అశోక్, సూరి, వెంకటేష్ పాల్గొన్నారు.

5న ఎన్‌ఎంఎంఎస్ మాక్ మెగా గ్రాండ్ టెస్ట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 5న ఎన్ఎంఎంఎస్ మాదిరి గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేహెచ్ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్ష జరగనుంది. ఎన్ఎంఎంఎస్ మెగా మాక్ గ్రాండ్ టెస్ట్‌ను 5వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9652948041, 9963492723లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్: కాలువపల్లి వద్ద ఈనెల 24న ద్విచక్ర వాహన ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. గాయపడిన యువకులు ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ అలియాస్ (చోట) (22) ఆదివారం మృతిచెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

‘దుర్గం’లో దర్జాగా భూకబ్జా

- ఆలయాల పేరుతో స్థలాలు ఆక్రమణ
- బెస్త కులస్తులకు కేటాయించిన భూమిపై వివాదం
- లేఔట్లు, రిజర్వు స్థలాల్లో పాగా
- ఖండిస్తున్న ప్రజా సంఘాలు


బీటీపీ లేఔట్‌లో కబ్జాకు గురైన రిజర్వు స్థలం


ఆక్రమణ స్థలాన్ని కాపాడాలని బెస్తల ఆందోళన


అధికారులకు విన్నవించేందుకు వచ్చిన బాధితులు

రాయదుర్గం: జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గంలో యథేచ్ఛగా భూదోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు.. ఆక్రమించేస్తున్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం కావడంతో ఇక్కడ స్థిరపడేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. దీన్ని అదునుగా తీసుకున్న కొందరు ఆక్రమణలకు తెరలేపారు. బడా నాయకులు పేర్లు చెప్పుకొని చోటామోటా నాయకులు ప్రత్యక్షంగానో .. పరోక్షంగానో తలదూర్చి రూ.లక్షల విలువ చేసే భూములు స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు పరాధీనంలోకి వెళ్లిపోతున్నాయి. పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో సర్వే నంబర్ 110ఏ లోని కొండపొరంబోకు 50 సెంట్ల స్థలాన్ని బెస్త కులస్తులకు శ్మశాన వాటిక కోసం కేటాయించారు. ఇందులో సమాధాలలు కూడా నిర్మించారు. దీని పక్కన ఉండే కొంత స్థలంలో అయ్యప్పస్వామి ఆలయం నిర్మాణం పేరుతో కొందరు ఇటీవల జేసీబీతో చొరబడ్డారు. దీన్ని బెస్తలు అడ్డుకుని ఆందోళన చేశారు. స్థానిక తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదం సోషల్ మాధ్యమాల్లోనూ వైరల్‌గా మారింది. దీనిపై ఓ బీఎస్పీ నాయకుడు ఖండిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. బెస్తలకు న్యాయం చేయాలని అందులో డిమాండ్ చేశారు. అలాగే బీటీపీ లేఔట్‌లోనూ ఆలయం పేరుతో కొండను కరిగించారు. ప్రభుత్వ స్థలం సుమారు ఎకరం భూమికి పైగా చదునుచేశారు. దీని విలువ సుమారు రూ.లక్షల్లోనే ఉంటుంది. దీనిపై కూడా సర్వాత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుడి, బడి ఇతర సౌకర్యాల కోసం బీటీపీ లేఔట్‌లో రిజర్వు స్థలం కేటాయించినా అది ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది. దీంతో కొండను కబ్జాచేసి ఆలయ నిర్మాణం చేపట్టాల్సిన దుస్థితి పట్టిందని స్థానికులు చెప్తున్నారు. అలాగే బళ్లారి రోడ్డు లోని వైఎస్ విగ్రహం వెనుక సుమారు రూ.కోటి విలువచేసే భూమిపై ఓ అక్రమార్కుడు కన్నేశాడు. నకిలీ పత్రాలు సృష్టించి, దాన్ని స్వాధీనం చేసుకునేలా కుట్ర చేస్తున్నాడని స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు ఆరోపిస్తున్నారు. వీటిపై నిఘా ఉంచి విలువైన స్థలాలు పరిరక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

అక్రమార్కుల ఆధీనంలో లేఔట్లు..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2006లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం పట్టణంలోని బీటీపీ హైవేకు ఆనుకొని 13.25 ఎకరాలు కొనుగోలు చేసి లేఔట్ వేశారు. అందులో 30, 40 అడుగులతో రోడ్లు వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల కోసం 50 సెంట్లు (అర ఎకరం) కేటయించారు. మిగిలిన విస్తీర్ణంలో 1,272 ప్లాట్లు వేసి ఒక్కో లబ్ధిదారుడికి 2.50 సెంట్లు చొప్పున పంపిణీ చేశారు. అయితే చాలా మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీన్ని అదునుగా తీసుకున్న అక్రమార్కులు వాటికి నకిలీ పట్టాలు సృష్టించి, స్వాధీనం చేసుకున్నారు. విలువైన రిజర్వు స్థలం మొత్తం కబ్జాకు గురైంది. ఒక్కో ప్లాటు రూ.2.50 లక్షల నుంచి రూ.4 వరకు కొందరు విక్రయించినట్లు ఆరోణలు వినిపిస్తున్నాయి. అలాగే గౌడ, భంభంస్వామి, గ్యాస్‌గోడౌన్ లేఔట్లలోనూ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. వీటిపై విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల మున్సిపల్ సమావేశంలోనూ సభ్యులు దీనిపై లేవనెత్తారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు గురికాకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.

కబ్జాలను అడ్డుకోండి

పట్టణంలో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు చేపట్టాలి. బెస్తలకు కేటాయించిన స్మశానవాటిక దురాక్రమణ కాకుండా సంరక్షించాలి. ఆలయాల పేరుతో చదునుచేసే విలువైన స్థలంపై విచారణ జరిపించాలి. ప్రజామోదం మేరకు అవసరమైతే ఆలయాలకు కొంత స్థలం కేటాయించాలి. లేఔట్లలో రిజర్వు స్థలాలపై కన్నేసి కంచె వేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

విచారణకు ప్రత్యేక బృందాలు

ప్రభుత్వ భూములు ఎక్కడైనా కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు చేపడతాం. ఇందులో రాజీపడేది లేదు. అన్ని లేఔట్లలోనూ ఆక్రమణలపై నిగ్గుతేల్చేందుకు విచారణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. డిసెంబర్ ఒకటి నుంచి అధికారుల బృందం లేఔట్లను సందర్శిస్తుంది. అనర్హులు అని తేలితే నిర్దాక్షిణ్యంగా తొలగిస్తాం. ఆ స్థలాలను అర్హులకు అందేలా కృషి చేస్తాం. ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు దురాక్రమణకు గురైనట్టు గుర్తిస్తే కంచె ఏర్పాటు చేస్తాం. బోర్డులు పెట్టిస్తాం . రెవెన్యూ చట్టం మేరకు చర్యలు చేపడతాం.

– నాగరాజు, తహసీల్దార్, రాయదుర్గం

హిందూ ఆలయాలను పరిరక్షించుకుందాం


కూడేరు: మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ శంకరానంద

కూడేరు: హిందూ ఆలయాలను పరిరక్షించుకుందామని ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ శంకరానంద పిలుపు నిచ్చారు. ఆదివారం జల్లిపల్లిలో విశ్వ హిందూ పరిషత్ – ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో హిందూ ఆలయాల పరిరక్షణపై ప్రజలకు అవగాగాహన కల్పించారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ శంకరానంద మాట్లాడుతూ దేవదాయశాఖ ఆలయాల నుంచి వచ్చే ఆదాయంపై దృష్టి పెడుతోందని, కానీ ఆలయాల అభివృద్ధిపై శ్రద్ధ చూపలేదన్నారు. దీంతో ప్రఖ్యాతిగాంచిన హిందూ పుణ్యక్షేత్రాలు అభివృద్ధికి నోచుకోలేక పోతున్నాయన్నారు. వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం పేరిట బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల ఇన్‌చార్జ్ రఘునాథ్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి ఆలయంలో చోరీ


చోరీ జరిగిన బ్రహ్మంగారి ఆలయం

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బ్రహ్మంగారి ఆలయంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. దుండగులు ఆలయం తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. స్వామి వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. హుండీని బయటకు తీసుకెళ్లి అందులో ఉన్న నగదు ఎత్తుకెళ్లారు. హుండీని కంప చెట్లలో పడేశారు. సర్పంచు సంధ్యారాణి, పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్ మరమ్మతు


జల్లిపల్లి వద్ద ఎయిర్‌వాల్వ్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన అనంత తాగునీటి పైపులైన్‌కు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వ్ లీకేజీకి ఆదివారం మరమ్మతు చేయించారు. ‘తాగునీరు వృథా’ శీర్షికన ‘సాక్షి’లో శనివారం వార్త ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించారు. తాగునీటి వృథాను అరికట్టారు.

నాటుసారా ఊట ధ్వంసం

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లి గ్రామ శివారులో ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నాటుసారా స్థావరంపై ఆదివారం దాడి చేశారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. డీ.చెన్నేపల్లి గ్రామంలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఆనంద్‌ను అరెస్టు చేసి, అతని నుంచి 34 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం


ఆర్డీటీ ఆసుపత్రిలో ఎయిడ్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది


ఉద్దేహాళ్‌లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


ఉరవకొండలో ఎయిడ్స్ ర్యాలీ ప్రారంభిస్తున్న మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి


రాయదుర్గంలో ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారి మెర్సీ జ్ఞానసుధ


కంబదూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కణేకల్లు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కణేకల్లుక్రాస్ ఆర్డీటీ ఆసుపత్రి డైరెక్టర్ దుర్గేష్, డాక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ నాగరాజు తెలిపారు. ఆదివారం కణేకల్లుక్రాస్‌లోని ఆర్డీటీ ఆసుపత్రిలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విద్యావంతులు మౌనం వీడి ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విస్తృత అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సాధన, సింధు, ల్యాబ్ టెక్నీషియన్ ఫజులు, కౌన్సిలర్లు వరలక్ష్మి, నరేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ రాజేష్ తెలిపారు. ఆదివారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వం ఆసుపత్రి నుంచి టీ సర్కిల్ వరకు అంగన్‌వాడీ సిబ్బంది, సాంఘిక సంక్షేమ వసతిగృహ విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్ బాబు, రైడ్స్ మేనేజర్ మహేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను తరిమికొడదాం

బొమ్మనహాళ్: ప్రజలందరినీ చైతన్యవంతుల్ని చేసి, ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని బొమ్మనహాళ్ పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లీశ్వరి తెలిపారు.ఆదివారం ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉద్దేహాళ్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

రాయదుర్గంటౌన్: ప్రాణాంతక ఎయిడ్స్/హెచ్ఐవీపై నిర్మూలనపై ప్రజలకు చైతన్యం కల్పించి ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏరియా ఆస్పత్రి వైద్యాధికారి మెర్సీ జ్ఞానసుధ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యశాఖ, ఐసీటీసీ, మాస్ ఎడ్యుకేషన్, ఆరోగ్య సిబ్బంది, వివిధ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. స్థానిక ఆస్పత్రి వద్ద ర్యాలీని వైద్యాధికారి, వైద్యులు జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలు ఉష, నేత్రవతి, ఉషారాణికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్‌సాయి, రమేష్, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, ల్యాబ్ టెక్నీషియన్ సురేష్‌బాబు, ఎస్టీఎస్ శ్రీకాంత్ నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణ పాల్గొన్నారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నిర్మూలన

కంబదూరు: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్ వ్యాధి నిర్మూలన సాధ్యమని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు,కేజీబీవీ విద్యార్థినులతో ఆదివారం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఎంఈఏ నూర్ మహమ్మద్, ఏఎన్ఎం అనసూయ, రిడ్స్ సిబ్బంది యశోదమ్మ, వరలక్ష్మి, భాగ్యమ్మ, వసంతబాయి, రేణుకాబాయి, సవ్యజ్యోతి, నాగలక్ష్మి, కవిత,లక్ష్మి నరసమ్మ, శశికళ, అరుణ, రుక్మిణి పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

- ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి

ఉరవకొండ: ఎయిడ్స్ నిర్మూలనకు గ్రామ గ్రామానా అవగాహన కల్పించడమే మార్గమని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీటీసీ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. అనంతరం మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి మాట్లాడుతూ ఎయిడ్స్ చాపకింద నీరులా వ్యాప్తి చెందకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఇస్మాయిల్, భరత్, వినీత, ఐసీటీసీ కౌన్సిలర్ రవిప్రసాద్, కైలాసం, యమున, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, లింక్‌వర్కర్లు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం


బెళుగుప్పలో పూజలు చేస్తున్న మహిళలు


వేంకటరమణస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి


జరుట్లరాంపురంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ ఆలయాల్లో కార్తీక మాసం చివరిరోజు అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం రాత్రి జరిగిన లక్ష దీపోత్సవం కాంతులీనింది. పట్టణంలోని కోటలో ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం, జంభుకేశ్వరస్వామి ఆలయాల్లో లక్ష దీపోత్సవం, జ్వాలా తోరణం వైభవంగా జరిగింది. లక్ష దీపోత్సవానికి భక్తులు పోటెత్తడంతో ఆలయాలు కిటకిటలాడాయి. వేంకటరమణస్వామికి చేసిన పూల అలంకరణంగా ఆకట్టుకుంది. జ్వాలా తోరణం, సహస్ర నామార్చన, ఆకాశ జ్యోతి, ప్రత్యేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కార్తీక దామోదర వ్రతం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి రోజు అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం రాత్రి సామూహిక కార్తీక దామోదర వ్రతాన్ని నిర్వహించారు. అంతకుముందు చుంచుల వంశస్థుల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం, పల్లకీ ఉత్సవం నిర్వహించారు. నగరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక సామూహిక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఘనంగా ఆంజినేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామికి కుంకుమార్చన, ఆకుపూజ, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని తిలకించడానికి గ్రామ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి వీక్షించారు. అందంగా అలంకరించిన రథంలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. సోమవారం స్వామిని ముత్యాల పల్లకీలో ఊరేగిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.


వజ్రకరూరులో త్రిముకేశ్వరస్వామి

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవ పూజలు

వజ్రకరూరు: మండల కేంద్రంలో నగరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. ఆలయంలో త్రిముకేశ్వరస్వామిగా దర్శనమిచ్చారు. అనంతరం కోటి దీపోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జరుట్లరాంపురం గ్రామంలోని జరుట్లరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మంజునాథ ఆలయంలో కార్తీక దీపోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు.

ముగిసిన కార్తీక మాసం పూజలు

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు భక్తులు ఆదివారం నిర్వహించారు. చివరి రోజు భక్తులు పోటెత్తారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు చేశారు.


మార్కండేయస్వామి ఆలయంలో కార్తీక దామోదర వ్రతంలో పాల్గొన్న మహిళలు


నగరేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి (బాలురు) హ్యాండ్‌బాల్ పోటీలు ఆదివారం నిర్వహించారు. జిల్లా స్థాయి (బాలురు) పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 25 మంది విదార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోషియేషన్ కార్యదర్శి సాకే శివశంకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు త్వరలోనే కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానంలో నిర్వహిస్తుమని సాకే శివ శంకర్ తెలిపారు. కార్యక్రమంలో డ్రిల్ మాస్టర్లు మురళి, కుళ్లాయిస్వామి, నవీన్, వలి, పాల్గొన్నారు.